క్లుప్తంగా

హోటళ్లు, బేకరీల తనిఖీ



ఉరవకొండలో షాపును తనిఖీ చేస్తున్న దృశ్యం

ఉరవకొండ: పట్టణంలో పలు హోటళ్లు, బేకరీ షాపులు, సెల్‌ఫోన్ షాపులను ఎస్‌ఐ జనార్దన్‌నాయుడు సిబ్బందితో కలిసి మంగళవారం తనిఖీ చేశారు. ఎస్‌ఐ మాట్లాడుతూ గంజాయి లాంటి మత్తు పదార్థాలను రహస్యంగా విక్రయిస్తున్నట్లు వచ్చిన సమాచారం అందిందన్నారు. అనుమానాస్పదంగా ఉన్న షాపులు, వ్యాపార దుకాణాలను తనిఖీ చేసినట్లు తెలిపారు. గంజాయి, మాదక ద్రవ్యాలు అమ్మడం, కొనడం నేరమని, అలాంటి వారిపై కఠినంగా వ్యవహరిస్తామన్నారు.

పేదరిక నిర్మూలనే లక్ష్యం

రాయదుర్గంటౌన్: పేదరిక నిర్మూలనే లక్ష్యంగా పబ్లిక్ ప్రైవేట్ పీపుల్స్ పార్టనర్‌షిప్ (పీ–4) కార్యక్రమానికి శ్రీకారం చుట్టినట్లు మున్సిపల్ కమిషనర్ దివాకర్‌రెడ్డి తెలిపారు. మంగళవారం పట్టణంలోని 1వ వార్డు సచివాలయం పరిధిలో ప్రజలతో సమావేశం నిర్వహించారు. పీ–4 కార్యక్రమంతో సమాజంలో ఉన్న 20 శాతం నిరుపేదల అభ్యున్నతికి కృషి చేస్తున్న ట్లు చెప్పారు. మున్సిపల్ చైర్‌పర్సన్ పొరాళ్ల శిల్ప, నోడల్ ఆఫీసర్ సత్యనారాయణ పాల్గొన్నారు.

పరీక్షలు ప్రశాంతంగా రాయాలి

శెట్టూరు: పదో తరగతి విద్యార్థులు పరీక్షలంటే భయపడొద్దని, ప్రశాంతంగా రాయాలని ఏఎస్ డబ్ల్యూఓ దామోదర్ రెడ్డి అన్నారు. మంగళవారం స్థానిక ఎస్సీ బాలుర వసతి గృహంలో ఏఎస్ డబ్ల్యూఓ ఆకస్మిక తనిఖీ నిర్వహించారు. అనంతరం హాస్టల్లో విద్యార్థులకు భోజనం, గుడ్డు అందుతున్నాయా లేదా? వార్డన్ హాస్టల్లో విద్యార్థులకు అందుబాటులో ఉంటున్నారా? అని అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో ఎంఈఓ శ్రీధర్, వార్డన్, విద్యార్థులు పాల్గొన్నారు.

గుణాత్మక విద్యనందించాలి



మాట్లాడుతున్న ఎంఈఓ తిమ్మప్ప తదితరులు

వజ్రకరూరు: విద్యార్థులకు గుణాత్మక విద్యను అందించి ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దాలని ఎంఈఓ తిమ్మప్ప సూచించారు. మంగళవారం కొనకొండ్ల ప్రాథమిక పాఠశాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. అనంతరం పాఠశాలలో అమలవుతున్న మధ్యాహ్న భోజన పథకాన్ని తనిఖీ చేశారు. కార్యక్రమంలో హెచ్‌ఎం ఫయాజున్నీషా, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

యోగాతో మానసిక ప్రశాంతత



మాట్లాడుతున్న ఈశ్వరీ బ్రహ్మకుమారీ కేంద్రం సంచాలకులు పుష్ప

ఉరవకొండ: యోగాతో మానసిక ప్రశాంతత లభిస్తుందని ప్రజాపిత బ్రహ్మకుమారీ ఈశ్వరీయ విశ్వ విద్యాలయ సంచాలకురాలు పుష్ప తెలిపారు. మంగళవారం పట్టణంలోని ఇంద్రానగర్ మొదటి క్రాస్ వద్ద నూతనంగా నిర్మించిన శివజ్ఞానామృత భవనంలో పుష్ప విలేకరులతో మాట్లాడారు. ఈనెల 27న ఇంద్రానగర్ మొదటి క్రాస్‌లో శివజ్ఞానామృతభవనాన్ని గవిమఠం ఉత్తరాధికారి కరిబసవ రాజేంద్రస్వామి, మంత్రి పయ్యావుల చేతుల మీదుగా ప్రారంభిస్తున్నట్లు తెలిపారు. అదే రోజు 12 జ్యోతిర్లింగాల కాంతి యాత్ర ఉంటుందన్నారు.

సర్వసభ్య సమావేశం వాయిదా

కంబదూరు: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ లక్ష్మిదేవమ్మ అధ్యక్షతన మంగళవారం జరగాల్సిన సర్వసభ్య సమావేశానికి సభ్యులు హాజరుకాలేదు.దీంతో సమావేశం వాయిదా వేసినట్లు ఎంపీడీఓ గూడెన్న తెలిపారు. వాయిదా పడిన సమావేశాన్ని ఎప్పుడు నిర్వహించేది సభ్యులు, అధికారులకు తెలియజేస్తామని ఎంపీడీఓ తెలిపారు.

400 మందికి రంజాన్ కిట్లు




కిట్లు అందిస్తున్న మున్సిపల్ కమిషనర్ దివాకర్ రెడ్డి, సీఐ జయానాయక్, ప్రభుత్వ ఖాజీ సైఫుల్లా

రాయదుర్గంటౌన్: పట్టణంలోని మక్కా మసీదు వద్ద దాతల సహకారంతో మక్కా మసీదు యూత్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో 400 మందికి పండుగ సరుకుల కిట్లు మంగళవారం పంపిణీ చేశారు. మున్సిపల్ కమిషనర్ దివాకర్‌రెడ్డి, అర్బన్ సీఐ జయానాయక్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరితో సమానంగా పేదల ఇళ్లలోనూ పండుగ వాతావరణం కల్పించేలా సరుకులు పంపిణీ చేయడం అభినందనీయమన్నారు. ప్రభుత్వ ఖాజీ సైఫుల్లా, జామియా మసీదు ఇమామ్ ఏజాజ్ ముస్తఫా మాట్లాడారు. కార్యక్రమంలో విశ్రాంత అధ్యాపకుడు అయూబ్‌ఖాన్, షబ్బీర్, అన్వారుల్ ఉలూమ్ మదరసా అధ్యక్షుడు జిలాన్, అంజుమన్ కమిటీ అధ్యక్షుడు బ్రెడ్ సర్మాస్, మక్కా మసీదు యూత్ ఆర్గనైజేషన్ ప్రెసిడెంట్ మహమ్మద్ రఫీక్, గౌరవ సలహాదారుడు కొలిమి సలామ్, యువ సేవకులు షమీర్, సాహెల్, జుబేర్, అశ్వాక్, యాసిన్, పాల్గొన్నారు.



గోవిందవాడలో పల్లె పండుగ కార్యక్రమంలో భాగంగా నిర్మించిన సీసీ రోడ్డు



త్వరలోనే బిల్లులు చెల్లిస్తాం

పల్లె పండుగ పేరుతో ఉపాధి హామీ పథకం కింద చేపట్టిన సీసీ రోడ్లు అన్ని గ్రామాల్లో పూర్తయ్యాయి. వాటికి ఇప్పటికీ బిల్లులు రాలేదు. బొమ్మనహాళ్ మండలంలో రూ.85 లక్షలు మాత్రమే బిల్లులు చెల్లించాం. మిగిలిన రూ.2.64 కోట్లు చెల్లించాల్సి ఉంది. మూడు నెలలుగా బిల్లులు మంజూరు కాలేదు. జిల్లా కలెక్టర్ పలుమార్లు పల్లె పండుగపై సమీక్షించి త్వరగా బిల్లులు చెల్లించేలా చేస్తామని తెలిపారు. ఎక్కడైనా పనులు మిగిలి ఉంటే పూర్తి చేయాలని ఆదేశించారు. వాటిని కూడా త్వరలోనే పూర్తి చేసి బిల్లులు చెల్లిస్తాం.

– జగదీష్,
పంచాయతీ రాజ్ జేఈ, బొమ్మనహాళ్

పల్లె పండుగ సరే.. బిల్లులేవీ?

- అభివృద్ధి పనులు చేసి మూడు నెలలైనా పైసా విడుదల చేయని ప్రభుత్వం
- ఆగిపోయిన బిల్లుల చెల్లింపుతో అవస్థలు
- వడ్డీలు పెరిగిపోతాయని ఆవేదన

బొమ్మనహాళ్: కూటమి ప్రభుత్వం పల్లెల్లో అభివృద్ధి పనులు చేసేందుకు 'పల్లె పండుగ – పంచాయతీ వారోత్సవాలు'కు శ్రీకారం చుట్టింది. గ్రామాల్లో మౌలిక వసతుల కల్పనతోపాటు రైతులకు ఉపయోగపడే అభివృద్ధి పనులు చేపట్టాలని నిర్ణయించారు. అయితే అధికార పార్టీ నాయకులు, కార్యకర్తలకు ప్రయోజనం చేకూర్చేలా కార్యక్రమాలు రూపొందించారు. సీసీరోడ్లు, డ్రెయినేజీల నిర్మాణం, ఇతర అభివృద్ధి పనులు, సంక్షేమ పథకాల పనులు వారికే అప్పజెప్పారు. ప్రభుత్వం మనదే.. బిల్లులు వెంటనే మంజూరవుతాయని అప్పు చేసి మరీ కూటమి నాయకులు పనులు పూర్తి చేశారు. అయితే పనులు చేసి మూడు నెలలవుతున్నా బిల్లులు రాకపోవడంతో తమ్ముళ్లు లబోదిబోమంటున్నారు. ఆదాయం వస్తుందని ఆశ పడి వడ్డీలకు తెచ్చి పనులు చేశామని, బిల్లులు రాకపోవడంతో వడ్డీలు పెరిగిపోతున్నాయని వాపోతున్నారు.

రాయదుర్గం నియోజకవర్గంలో బొమ్మనహాళ్, కణేకల్లు, డి.హీరేహాళ్, గుమ్మఘట్ట, రాయదుర్గం ఐదు మండలాలకు రూ.16.80 కోట్లు ప్రభుత్వం మంజూరు చేసింది. ఈ నిధులతో 420 పనులు చేయాలని ఆదేశించింది. గోకులం పేరుతో పశువుల షెడ్ల నిర్మాణం చేపట్టాలని ఆదేశించింది. పనులకు ప్రతి గ్రామంలో తమ కార్యకర్తలకే ఇచ్చేలా చర్యలు తీసుకుంది. పనులు దక్కించుకున్న కూటమి నాయకులు ప్రతి గ్రామంలోనూ కనీసం ఒక పని రూ.5 లక్షలకు తక్కువ కాకుండా మంజూరు చేయించుకొని పనులు ప్రారంభించారు. త్వరితగతిన పనులు పూర్తి చేసి, బిల్లులు మంజూరు చేసుకుని ఆదాయం పొందొచ్చని భావించారు. ఇందులో కొందరు పెట్టుబడికి లేకపోయినా బయటి వ్యక్తుల నుంచి అప్పు తెచ్చి పనులు చేశారు.

రూ.13.18 కోట్లు పెండింగ్ :

నియోజకవర్గంలో బొమ్మనహాళ్, కణేకల్లు, డి.హీరేహాళ్, గుమ్మఘట్ట, రాయదుర్గం ఐదు మండలాలకు 420 పనులకు గాను 404 పనులు పూర్తి చేశారు. బొమ్మనహాళ్ మండలం గోనేహాళ్ గ్రామంలో పెండింగ్‌లో ఉంది. పనులు ప్రారంభిస్తే.. ప్రతి వారం బిల్లులు వస్తాయని ప్రచారం జరగడంతో అప్పు తెచ్చి పనులు చేశారు. కానీ ఇప్పటి వరకు బిల్లులు రాకపోవడంతో కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నారు. నియోజకవర్గ వ్యాప్తంగా రూ.16.80 కోట్లతో పనులు చేశారు. చేపట్టగా, ఇప్పటి వరకు రూ.13.18 కోట్లు బిల్లులు పెండింగ్ లో ఉన్నాయి.

బిల్లు రాక ఘొల్లుమంటున్న నాయకులు..

పనులు పూర్తి చేసి మూడు నెలలు పూర్తవుతున్నా ఇప్పటి వరకు బిల్లులు రాలేదు. మండల పరిషత్ కార్యాలయాల చుట్టూ తిరగలేకపోతున్నామని కూటమి నేతలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అధికారంలోకి వచ్చిన 10 నెలల్లోనే చేసిన పనులకు బిల్లుల చెల్లింపుల్లో ఆలస్యం చేస్తే భవిష్యత్‌లో పనులు ఎలా చేయాలని కొందరు ప్రశ్నిస్తున్నారు. కేంద్ర ప్రభుత్వం ద్వారా మంజూరైన నిధుల చెల్లింపుల్లోనూ ఆలస్యం చేయడం ఎంత వరకు సబబు అని అసహనం వ్యక్తం చేస్తున్నారు.

అనుయాయులకు ఆదాయ మార్గంపై దృష్టి

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే ప్రభుత్వ పెద్దలు తమ కార్యకర్తలకు ఆదాయం వచ్చే మార్గాలపై దృష్టి సారించారు. ఇందులో భాగంగా ఇసుక, మట్టి తరలిస్తున్నా చూసీచూడనట్లు వ్యవహరించాలని అధికారులకు మౌఖికంగా ఆదేశించారు. అంతటితో ఆగకుండా పల్లె పండుగ పేరుతో ఉపాధి హామీ పథకం నిధులు ఖర్చు చేసి సీసీ రోడ్లు, కాలువల నిర్మాణ పనులు అప్పగించారు. వీటి ద్వారా వారికి మేలు చేయాలని భావించారు.



కొలగానపల్లిలో నిర్మించిన సీసీ రోడ్డు

పల్లె పండుగ కింద చేసిన పనుల వివరాలు..				
మండలం	మంజూరైన పనులు	పూర్తయ్యినవి పనులు	మంజూరైన నిధులు	పెండింగ్ రూ. (సుమారు)
బొమ్మనహాళ్	83	82	రూ.3.51 కోట్లు	రూ.2.64 కోట్లు
కణేకల్లు	93	86	రూ.4.10 కోట్లు	రూ.3.79 కోట్లు
గుమ్మఘట్ట	101	100	రూ.3.40 కోట్లు	రూ. 2.85 కోట్లు
రాయదుర్గం	67	60	రూ. 3 కోట్లు	రూ. 2.20 కోట్లు
డి.హీరేహాళ్	76	76	రూ.2.79 కోట్లు	రూ.1.70 కోట్లు

మద్యం రవాణాపై నిఘా ఉంచాలి



ఎక్సైజ్ స్టేషన్‌ను తనిఖీ చేస్తున్న డీసీ నాగమద్దయ్య

కంబదూరు: నాటుసారా తయారీ, విక్రయాలు, కర్ణాటక మద్యం అక్రమ రవాణాపై నిఘా ఉంచాలని ఎక్సైజ్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ డిప్యూటీ కమిషనర్ నాగమద్దయ్య ఆదేశించారు. మంగళవారం స్థానిక ఎక్సైజ్ పోలీసు స్టేషన్‌ను సూపరింటెండెంట్ శ్రీరామ్‌తో కలిసి ఆకస్మికంగా తనిఖీ చేశారు. స్టేషన్‌లోని రికార్డులను పరిశీలించి, సిబ్బంది విధులు, పెండింగ్ కేసుల వివరాలను సీఐ సునిల్‌కుమార్‌ను అడిగి తెలుసుకున్నారు. నవోదయం 2.0 కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని తెలియజేశారు.

ప్రజా సమస్యలు పరిష్కరించండి



అధికారులతో మాట్లాడుతున్న కాలవ శ్రీనివాసులు

రాయదుర్గం: ప్రజా సమస్యల పరిష్కారానికి అధికారులు చిత్తశుద్ధితో కృషి చేయాలని ప్రభుత్వ విప్ కాలవ శ్రీనివాసులు తెలిపారు. మంగళవారం రోడ్లు, భవనాల శాఖ అతిథి గృహంలో ఆర్డీఓ వసంతబాబు, ఆర్‌అండ్‌బీ డీఈ రవిశంకర్‌రెడ్డి, మున్సిపల్ కమిషనర్ దివాకర్‌రెడ్డి, ఆయా మండలాల తహసీల్దార్లు, డీటీలతో సమావేశం నిర్వహించారు. విప్ కాలవ మాట్లాడారు. తహసీల్దార్లు నాగరాజు, మునివేలు, శ్రీనివాసులు, డీటీలు, అధికారులు పాల్గొన్నారు.

భూసార పరీక్షల ఆధారంగా ఎరువులు వాడాలి

ఉరవకొండ: భూసార పరీక్షల ఆధారంగా ఎరువులు వాడాలని వ్యవసాయ శాఖ అధికారి శుభకర్ తెలిపారు. మంగళవారం లత్తవరంలోని రైతు సేవా కేంద్రాన్ని ఏఓ తనిఖీ చేసి, అనంతరం రైతులతో అవగాహన సమావేశం ఏర్పాటు చేశారు. రైతులు విశిష్ట సంఖ్య నమోదు చేసుకోవాలని, ప్రస్తుతం పోర్టల్ పని చేస్తోందన్నారు. ప్రభుత్వం మద్దతు ధరతో ఏపీ మార్క్‌ఫెడ్ ఆధ్వర్యంలో పప్పుశనగ కొనుగోలు చేస్తోందన్నారు. క్వింటా రూ.5,650 ప్రకారం కొనుగోలు చేయడానికి నిర్ణయించినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఏఈఓ భరత్, వీహెచ్‌ఏ గోపాల్‌నాయక్ తదితరులు పాల్గొన్నారు.

కణేకల్లు ఎంపీపీ స్థానానికి రేపే ఎన్నిక



కణేకల్లు మండల పరిషత్ కార్యాలయం

కణేకల్లు: కణేకల్లు ఎంపీపీ స్థానానికి గురువారం ఎన్నికలు జరగనున్నాయి. ఎన్నికల కోసం స్థానిక మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో అధికారులు సర్వం సిద్ధం చేశారు. గురువారం ఉదయం 10 గంటల నుంచి 11 గంటల వరకు నామినేషన్ల స్వీకరించున్నట్లు ఎంపీడీఓ పీడీ శ్రీనివాసులు తెలిపారు. ఆ తర్వాత స్రూట్నీ, నామినేషన్ల ఉప సంహరణ ప్రక్రియ ఉంటుందని, ఒకటి కంటే ఎక్కువ నామినేషన్లు వస్తే చేతులెత్తే పద్ధతి ద్వారా ఎన్నికలు నిర్వహిస్తామన్నారు. ఒకే నామినేషన్ వస్తే వారినే ఎంపీపీగా ప్రకటిస్తామన్నారు. ఎంపీపీ ఎస్సీ రిజర్వ్‌డ్ కావడంతో గెనిగెర ఎంపీటీసీ సంధ్య... సెప్టెంబర్ 24, 2021 ఎంపీపీగా ఎన్నికయ్యారు. అప్పటి నుంచి ఈ ఏడాది జూన్ 19 వరకు ఆమె ఎంపీపీగా కొనసాగారు. వ్యక్తిగత కారణాల రీత్యా ఆమె ఎంపీటీసీతోపాటు ఎంపీపీ పదవికి రాజీనామా చేశారు. దీంతో ఎంపీపీ ఎంపిక అనివార్యమైంది. వైస్ ఎంపీపీ–1 లీలావతికి ఇన్‌చార్జ్ బాధ్యతలు అప్పగించారు. తాజాగా ఖాళీగా ఉన్న ఎంపీపీ స్థానాలను భర్తీ చేసేందుకు నోటిఫికేషన్ విడుదలయ్యింది. గురువారం జరిగే ఎంపీపీ ఎన్నికకు అధికారులు ఏర్పాట్లు పూర్తి చేశారు. మండలంలో మొత్తం ఎంపీటీసీ స్థానాలు 19 ఎంపీటీసీ స్థానాలుండగా, 18 ఎంపీటీసీ స్థానాలను వైఎస్సార్‌సీపీ కైవసం చేసుకుంది. ఎన్.హనుమాపురం ఎంపీటీసీ స్థానం మాత్రమే టీడీపీ దక్కించుకుంది. 18 మంది వైఎస్సార్‌సీపీ ఎంపీటీసీల్లో సొల్లాపురం ఎంపీటీసీ కేశవరెడ్డి టీడీపీ తీర్థం పుచ్చుకున్నారు. గెనిగెర ఎంపీటీసీ సంధ్య ఎంపీటీసీ పదవికి రాజీనామా చేశారు. ప్రస్తుతం ఉన్న ఎంపీటీసీల సంఖ్య 18కి చేరింది. వీరిలో 16 మంది ఎంపీటీసీలు వైఎస్సార్‌సీపీకి చెందినవారే ఉన్నారు. ఎస్సీ రిజర్వ్‌డ్ ఎంపీటీసీలు మూడున్నాయి. గరుడచేడు వంద్రయ్య, కణేకల్లు–4 మారుతమ్మ, పూలచెర్ల గంగమ్మలు ఎస్సీ రిజర్వ్‌డ్ ఎంపీటీసీలు. వీరిలో ఒకరికి ఎంపీపీ పీఠం వరించనుంది.

ఎంపీపీగా వంద్రయ్య?

కణేకల్లు ఎంపీపీగా గరుడచేడు ఎంపీటీసీ అయిన హరిజన వంద్రయ్య పేరును వైఎస్సార్‌సీపీ అధిష్టానం ఖరారు చేసినట్లు విశ్వసనీయ వర్గాల ద్వారా తెలిసింది. ఎస్సీ రిజర్వ్‌డ్ ఎంపీటీసీలు ముగ్గురుండగా, పార్టీ అధిష్టానం మాత్రం వంద్రయ్యను ఎంపిక చేసినట్లు తెల్సింది.

ఈ-కేవైసీ కోసం కార్డుదారుల అగచాట్లు



ఉంతకల్లులో ఈ-కేవైసీ కోసం గుమికూడిన రేషన్ కార్డుదారులు

బొమ్మనహాళ్: రేషన్ కార్డు దారులందరూ ఈ-కేవైసీ చేయించుకోవాలని ప్రభుత్వం ఆదేశాలు ఇచ్చింది. దీంతో కార్డుదారులు ఈ-కేవైసీ చేయించుకునేందుకు పాట్లు పడుతున్నారు. రేషన్ డీలర్లు ఈ-కేవైసీ చేయడంతో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుండటం, ఈ నెల 31వ తేదీ వరకే గడువు అని అధికారులు చెబుతుండడంతో కార్డుదారులు ఆయా గ్రామాల్లోని కార్యాలయాలు, రేషన్ డీలర్ల, ఎండీయూ ఆపరేటర్లు చుట్టూ తిరుగుతున్నారు. చిన్న పిల్లలు, వృద్ధులు, దివ్యాంగులు కార్యాలయాలు, రేషన్ డీలర్ల, ఎండీయూ ఆపరేటర్లు వద్దకు అష్టకష్టాలు పడి వస్తున్నారు.

ఈకేవైసీ తప్పనిసరిగా చేయించుకోవాలి

శెట్టూరు: రేషన్ పొందుతున్న ప్రతి ఒక్కరూ ఈకేవైసీ తప్పనిసరిగా చేయించాలని ఆయా గ్రామాల్లోని రేషన్ డీలర్లకు తహసీల్దార్ ఈశ్వరయ్య శెట్టి సూచించారు. మంగళవారం కార్యాలయంలో డీలర్లతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ప్రజలకు రేషన్ షాపుల ద్వారా ప్రభుత్వ రాయితీ సరుకులు సక్రమంగా అందాలన్నారు. డీలర్లు అవకతవకలకు పాల్పడితే చర్యలు తీసుకుంటామన్నారు. మండలంలో 41,867 మంది రేషన్ కార్డుల్లో సభ్యులు ఉన్నారని, అందులో 36,231 మంది తమ ఈకేవైసీ పూర్తి చేశారని, మిగిలిన 5,636 మంది ఈకేవైసీ చేయలేదన్నారు. కార్యక్రమంలో ఎండీఎం ఆపరేటర్లు, డీలర్లు పాల్గొన్నారు.

సంక్షిప్త సమాచారం

ఘనంగా ఏకాదశి పూజలు

బొమ్మనహాళ్: ప్రసిద్ధి చెందిన ఉంతకల్లు రుక్మిణీ పాండురంగస్వామికి ఏకాదశి పూజలు జరిగాయి. మంగళవారం తెల్లవారుజామున ప్రత్యేక జలంతో స్వామికి అభిషేకం చేశారు. మూలవిరాట్‌కు పట్టువస్త్రాలు, పుష్పాలతో శోభాయమానంగా అలంకరించారు. అనంతరం కుంకుమార్చన, పంచామృతాభిషేకం, ఆకుపూజ మహామంగళహారతి పూజలు చేశారు.

చలివేంద్రం ఏర్పాటు



శెట్టూరులో చలివేంద్రం ప్రారంభిస్తున్న దృశ్యం

బొమ్మనహాళ్: ప్రజల వేసవి దాహార్తి తీర్చేందుకు చలివేంద్రాలు దోహదపడతాయని ఎంపీడీఓ విజయభాస్కర్ తెలిపారు. మంగళవారం ఉంతకల్లు, ఉద్దేహాళ్ గ్రామాల్లో చలివేంద్రాలను ఏర్పాటు చేశారు. ఎంపీడీఓ మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో ప్రజల దాహార్తి తీర్చేందుకు చలివేంద్రాలను పంచాయతీల్లో ఏర్పాటు చేశామన్నారు. కార్యక్రమంలో ఈఓపీఆర్‌డీ దాస్, సర్పంచ్ ముక్కన్న, పంచాయతీ కార్యదర్శి శివన్న, తదితరులు పాల్గొన్నారు.

శెట్టూరు: మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయం వద్ద చలివేంద్రం ఏర్పాటు చేశారు. మంగళవారం బసంపల్లి గ్రామస్తులు కార్యాలయం వచ్చే ప్రజల కోసం, ప్రయాణికుల కోసం చలివేంద్రం ప్రారంభించారు. స్థానిక సర్పంచ్ కుమార్, తెలుగుదేశం నాయకులు గురుప్రసాద్, హనుమంతరెడ్డి, వన్నూర్ రెడ్డి, శీనప్ప, నాగేష్, రామరాజు, మారుతి పాల్గొన్నారు.

నేడు మున్సిపల్ సమావేశం

రాయదుర్గంటౌన్: రాయదుర్గం పురపాలక సంఘ కార్యాలయంలోని కౌన్సిల్ హాల్‌లో ఈనెల 26న ఉదయం 11 గంటలకు కౌన్సిల్ సాధారణ సర్వసభ్య సమావేశం నిర్వహిస్తున్నట్లు చైర్‌పర్సన్ పొరాళ్ల శిల్ప తెలిపారు. సమావేశంలో పట్టణంలో చేపట్టే అభివృద్ధి కార్యక్రమాలతోపాటు ప్రజా సమస్యలపై చర్చించనున్నట్లు చెప్పారు. సమావేశానికి కౌన్సిల్ సభ్యులు, కోఆప్షన్ సభ్యులు, ఎక్స్‌అఫీషియో సభ్యులు, విభాగాల వారీగా అధికారులు హాజరుకావాలని కోరారు.

మామిడి చెట్లకు నిప్పు

కళ్యాణదుర్గం రూరల్: మండలంలోని చాపిరి, మాదిరెడ్డిపల్లి గ్రామాల మధ్యలో రైతు రాంబాబు, శ్రీలేకు చెందిన 80 మామిడి చెట్లు మంగళవారం కాలిపోయాయి. మామిడి చెట్లకు గుర్తు తెలియని వ్యక్తులు నిప్పు పెట్టారు. సకాలంలో ఫైర్ సిబ్బంది సంఘటనా స్థలానికి చేరుకొని మంటలు అదుపు చేశారు.

రీ సర్వేకు రైతులు సహకరించాలి

శెట్టూరు: రెండో విడత రీసర్వేకు రైతులు సహకరించాలని తహసీల్దార్ ఈశ్వరయ్య శెట్టి అన్నారు. మంగళవారం మండలంలోని చెర్లోపల్లి గ్రామంలో రీ సర్వేపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. గ్రామంలోని వీధుల్లో రీ సర్వేపై ర్యాలీ చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ విరుపాక్షి, రైతులు రెవిన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

నవోదయకు తండా విద్యార్థిని ఎంపిక

వజ్రకరూరు: ఎస్ఎస్‌పీ తండాకు చెందిన రమావత్ విద్య అనే విద్యార్థి నవోదయకు ఎంపికైనట్లు ఎంఈఓ తిమ్మప్ప, హెచ్‌ఎం వెంకటేశులు మంగళవారం తెలిపారు. రమావత్‌విద్య అనే విద్యార్థి ప్రస్తుతం ఎస్ఎస్ పీతండాలోని ప్రాథమిక పాఠశాలలో ఐదో తరగతి చదువుతోంది. రమా వత్ విద్య నవోదయకు ఎంపిక కావడంపై తల్లిదండ్రులు శీనా నాయక్, పద్మావతి హర్షం వ్యక్తం చేశారు.

కేజీబీవీలో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

కళ్యాణదుర్గం: స్థానిక కేజీబీవీలో ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ కె.నాగజ్యోతి మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. 2025–26 విద్యా సంవత్సరంలో ఆరోతరగతిలో 40 సీట్లు, 11వ తరగతి (బైపీసీ గ్రూప్)లో 40 సీట్లు ఉన్నట్లు తెలిపారు. ఈనెల 22 నుంచి ఏప్రిల్ 23 వరకు దరఖాస్తులు స్వీకరించనున్నట్లు తెలిపారు. పూర్తి వివరాలకు సెల్: 9441654504లో సంప్రదించాలన్నారు.

పెద్దమ్మ అమ్మవారి ఆలయం ప్రారంభం



పెద్దమ్మ అమ్మవారికి పూజలు నిర్వహించిన దృశ్యం

కూడేరు: ముద్దలాపురం ఊరి పొలిమేరలో నూతనంగా నిర్మించిన పెద్దమ్మ అమ్మవారి ఆలయాన్ని మంగళవారం గ్రామపెద్దలు, ఆలయ కమిటీ సభ్యులు ప్రారంభించారు. ఉదయం వేద పండితులు పెద్దమ్మ దేవతకు ప్రత్యేక పూజలు చేశారు. వివిధ రకాల పట్టు వస్త్రాలు, పుష్పాలతో అమ్మవారిని అలంకరించారు. అనంతరం భక్తులు పెద్ద ఎత్తున దర్శించుకొని మొక్కులు తీర్చుకున్నారు. అనంతరం అన్నదానం చేశారు.

యువతి అదృశ్యంపై ఫిర్యాదు

బొమ్మనహాళ్: ఆవులెన్న గ్రామానికి చెందిన యువతి రెండు రోజులుగా కనిపించలేదని ఆమె తండ్రి హనుమంతురాయుడు మంగళవారం ఫిర్యాదు చేసినట్లు ఎస్‌ఐ శివ తెలిపారు.

చెత్త నుంచి పంచాయతీలకు అదనపు సంపద

బొమ్మనహాళ్: చెత్త నుంచి సంపద సృష్టిస్తే గ్రామ పంచాయతీలకు అదనపు ఆదాయం సమకూరుతుందని ఎంపీడీఓ విజయభాస్కర్ తెలిపారు. మంగళవారం ఉంతకల్లు గ్రామంలోని చెత్త సంపద తయారీ కేంద్రాన్ని ఈఓపీఆర్‌డీ దాస్‌తో కలిసి పరిశీలించారు. కార్యక్రమంలో ఈఓపీఆర్‌డీ దాస్, సర్పంచ్ ముక్కన్న తదితరులు పాల్గొన్నారు.

వారపు సంత వేలం



కళ్యాణదుర్గంలో వేలం నిర్వహిస్తున్న మున్సిపల్ అధికారులు

కళ్యాణదుర్గం రూరల్: మున్సిపాలిటీ పరిధిలోని 2025–26 సంవత్సరం వారపు సంత, లారీ స్టాండ్, రోడ్డు మార్జిన్‌లో గుత్త వసూలుకు పట్టణంలోని మున్సిపల్ అధికారులు మంగళవారం వేలం వేశారు. లారి స్టాండ్ రూ.8,50,000, రోడ్డు మార్జిన్ రూ. 6,35,000, వారపు సంత రూ. 4,26,000 వేలంలో నిర్వాహకులు దక్కించుకున్నారు. బస్టాండ్ వేలం ప్రకటన బుధవారానికి వాదా పడింది.

భార్యపై గొడ్డలితో దాడి

ఉరవకొండ: మండలంలోని వై.రాంపురం గ్రామానికి చెందిన ఎర్రిస్వామి అనే వ్యక్తి భార్య మాధవిపై గొడ్డలితో మంగళవారం దాడి చేశాడు. ఈ దాడిలో ఆమె తీవ్రంగా గాయపడింది. ఉరవకొండ అర్బన్ సీఐ మహానంది తెలిపిన మేరకు..కుటుంబ కలహాల నేపథ్యంలో కూలీ పనులు ముగించుకొని ఇంటికి వచ్చిన భార్యపై ఎర్రిస్వామి ఒక్కసారిగా గొడ్డలితో తలపై దాడి చేశాడు. తీవ్రంగా గాయపడిన ఆమెను వెంటనే చికిత్స నిమిత్తం ఉరవకొండ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండటంతో అనంతపురం ఆస్పత్రికి తరలించారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.



టీచర్స్‌కాలనీలోని పార్కులో విరిగిపోయిన జారుడుబల్ల



రాజీవ్‌గాంధీ పార్కులో కనిపించని ఆహ్లాదం, కనుచూపు మేర కనిపించని గడ్డి



శాంతినగర్‌లోని పార్కులో ఫౌంటేన్ దుస్థితి

'దుర్గం' పార్కుల్లో ఆహ్లాదం ఎండమావి

రాయదుర్గంటౌన్: పట్టణంలోని పార్కుల్లో ఆహ్లాదకం కరువు అవుతోంది. మొత్తం ఐదు చోట్ల పార్కులున్నా ప్రయోజనం లేకపోతోంది. రూ.లక్షలు వెచ్చించి నిర్మించిన పార్కుల పట్ల అధికారులు అలసత్వం వహిస్తున్నారు. దీంతో ఆహ్లాదం ఎండమావిగా మారింది. దీనికితోడు పార్కుల పర్యవేక్షణ కొరవడింది. పిల్లలకు ఆట వస్తువులు కనిపించవు. ఏ పార్కులోనూ తాగునీటి వసతి లేదు. టీచర్స్ కాలనీలో చెట్లు, మొక్కలు ఏపుగా పెరిగి అడవిని తలపిస్తోంది. విష పురుగుల బెడదతో ప్రజలు పార్కులకు వెళ్లేందుకు ఆసక్తి చూపలేదు. శాంతినగర్‌లోని పార్కు రాత్రిపూట అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా మారింది. కణేకల్లు రోడ్డులోని రాజీవ్‌గాంధీ పార్కులో ఆహ్లాదం కొరవడింది. పట్టణంలోని ఏ పార్కులోనూ కూర్చొనేందుకు గడ్డి లేదు. పార్కుల్లో సౌకర్యాలు కల్పించి ఆహ్లాదం కోసం అధికారులు కృషి చేయాలని పట్టణవాసులు కోరుతున్నారు. షాదీమహల్ వద్ద నుంచి పార్క్ అండ్ప్లే గ్రౌండ్ ఓ ప్రైవేటు పాఠశాలకు ఆటస్థలంగా మారింది.



కణేకల్లు రోడ్డులోని పార్కులో పెరిగిన పాముల పుట్ట